## సచివాలయానికి అవార్డు

దేశవ్యాప్తంగా అత్యుత్తమ భద్రతా ప్రమాణాలు పాటించిన బృహత్ భవనంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయం గుర్తింపు సాధించింది. ఈ మేరకు సచివాలయ నిర్మాణ సంస్థ షాపూర్‌జీ పల్లోంజీ సంస్థకు నేషనల్ సేఫ్టీ కౌన్సిల్ 'సేఫ్టీ అవార్డ్-2023' ప్రకటించింది. మార్చి 15న హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో ఈ అవార్డును అందజేసింది.

**రామగుండ ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్‌కు అవార్డు**

పెద్దపల్లి జిల్లా రామగుండ ఎన్‌టీపీసీ రిజర్వాయర్‌లోని 100 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్‌కు ఇంటర్నేషనల్ సోలార్ ఎనర్జీ అవార్డు లభించింది. మార్చి 15న హైదరాబాద్‌లో ఈ అవార్డును అందజేశారు.

## పొలం గట్టు నుంచి సివిల్స్ మెట్టు దాకా..

**పుట్టింది వ్యవసాయ కుటుంబం. ఆ పరిస్థితులే అతన్ని చదువులో చురుకుగా ఉండేలా చేశాయి. నాన్నకు తెలిసినవాళ్లు చెప్పిన 'సివిల్స్' మాటను మనసులో దాచుకున్నాడు. అదే తడువుగా అటువైపు అడుగులు వేశాడు. నాలుగో ప్రయత్నంలో ఇంటర్వ్యూ దాకా వెళ్లినప్పటికీ పట్టుదలతో చదివి ఐదో ప్రయత్నంలో ర్యాంకును దక్కించుకున్నాడు. అతడే కొండపాకకు చెందిన అఖిల్ బుద్ధి విజయ ప్రస్థానం ఆయన మాటల్లోనే..**

**కుటుంబ నేపథ్యం, విద్యాభ్యాసం?**

- సిద్దిపేట జిల్లా కొండపాక మా స్వగ్రామం. అమ్మ లలిత, నాన్న నరేశ్ వ్యవసాయదారులు. తమ్ముడు అజయ్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేశాడు. 7వ తరగతి వరకు కొండపాక, 8వ తరగతి నుంచి ఇంటర్ వరకు సిద్దిపేటలో, కాకతీయ యూనివర్సిటీలో సివిల్ ఇంజినీరింగ్ పూర్తి చేశాను.

**సివిల్స్ వైపు రావడానికి స్ఫూర్తి ఎవరు? ఎలా ప్రిపేరయ్యారు?**

- తెలిసినవాళ్లు నాన్నకు చెప్పడంతో నన్ను సివిల్స్ వైపు వెళ్లేలా ప్రోత్సహించారు.
- ప్రత్యేకించి ఎవరిని స్ఫూర్తిగా తీసుకోలేదు. 2018 నుంచి ఇంటి దగ్గర ఉండి ప్రిపరేషన్ కొనసాగించాను. ప్రతిరోజు 8-9 గంటలు పుస్తకాలు నా కళ్ల ముందే ఉండేవి. పాలిటీ కోసం లక్ష్మీకాంత్ మెటీరియల్, హిస్టరీ-తమిళనాడు స్కూల్ బుక్స్ (ప్రాచీన, మధ్యయుగ), ఆధునికయుగం- స్పెక్ట్రమ్, జాగ్రఫీ-NCERT పుస్తకాలు తిరగేశాను. మిగతావి ఇంటర్‌నెట్‌లో చదివాను. ఎంత ఎక్కువ మెటీరియల్ చదివామన్నది కాకుండా ఏకాగ్రతతో ఎంత చదివామన్నదే ముఖ్యం. కరెంట్ టాపిక్స్ కోసం ఆంగ్ల పత్రికలు చూసేవాడిని. ఖాళీ సమయాల్లో పొలం పనులు కూడా చేసేవాడిని.

**ఎన్నో ప్రయత్నం, ఎంచుకున్న ఆప్షనల్ సబ్జెక్టు?**

- ఐదో ప్రయత్నంలో 321 ర్యాంకు సాధించినందుకు ఆనందంగా ఉంది. ఆప్షనల్ సబ్జెక్టుగా జాగ్రఫీ ఎంచుకున్నాను. ఈసారి ఐఏఎస్ వస్తుంది. అంతకుముందు నాలుగో అటెంప్ట్‌లో ఇంటర్వ్యూ వరకు వెళ్లగలిగాను. అయినా నిరాశ చెందలేదు. అప్పుడే ఇంకా నమ్మకం పెరిగింది. కష్టానికి సరైన ఫలితం దక్కితే ఆ సంతోషమే వేరు. 2021లో మూడోసారి సివిల్స్ రాసినప్పుడు 566వ ర్యాంకు వచ్చింది. ప్రస్తుతం డానిప్స్ (Danips) ఏసీపీ ఢిల్లీ పోలీసుగా విధులు నిర్వహిస్తున్నాను. నా విజయంలో కుటుంబ సహకారం మాటల్లో చెప్పలేనిది. ఎల్లప్పుడు వారికి రుణపడి ఉంటాను.

**అఖిల్ బుద్ధి**
**321వ ర్యాంక్**



**ఇంటర్వ్యూ ఎలా కొనసాగింది?**

- బీబీ స్వెయిన్ బృందం నన్ను ఇంటర్వ్యూ చేసింది. 25 నిమిషాల పాటు వివిధ సబ్జెక్టులు తదితర విషయాలపై ప్రశ్నించి నా సామర్థ్యాన్ని పరీక్షించారు. తెలంగాణ, ఏపీకి మధ్య కంపారిసన్, తెలంగాణలో కాకతీయుల ప్రాముఖ్యత, రాష్ట్రంలో స్త్రీల పరిస్థితి ఎలా ఉంది.. వారి కోసం ఏం చేస్తే బాగుంటుందని రాష్ట్రానికి సంబంధించిన ప్రశ్నలు అడిగారు.
- దేశంలో స్వచ్ఛ భారత్ అభియాన్ ఎందుకు సక్సెస్ అయింది? పర్యావరణం పరిరక్షణ, ఇండియా వన్డే వరల్డ్ కప్ ఓడిపోవడానికి గల కారణాలు.. ఇంకా ఇతర ప్రశ్నలు అడిగారు. ఎటువంటి తడబాటు లేకుండా దాదాపు అన్ని ప్రశ్నలకు సమాధానమిచ్చాను.

**సర్వీస్‌లో చేరాక...**

- వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చాను. పేదవారికి సేవ చేయడమే నా ప్రథమ కర్తవ్యం. నా పేరిట ఉన్న యూట్యూబ్ చానల్ ద్వారా ఫ్రీ కోచింగ్ ఇస్తున్నాను. పేద విద్యార్థులకు ఇది ఎంతో ఉపయోగకరంగా ఉందని చానల్‌లో కామెంట్లు చూసినప్పుడు గర్వంగా ఫీలవుతాను. ఇప్పటివరకు దాదాపు 200 మంది తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు గ్రూప్-1, ఎస్సై, కానిస్టేబుల్ తదితర ఉద్యోగాలు పొందారు. మాటల్లో కాకుండా ఆచరణలో చేసి చూపించడమే 'సక్సెస్'కు అసలైన నిర్వచనం.

**భవిష్యత్తులో పోటీ పరీక్షలు రాసేవారికి సలహాలు ?**

- ఏ ఉద్యోగం కోసం చదివినా పక్కా ప్రణాళిక ఉండాలి. సోర్స్ లేదని వెనకడుగు వేయొద్దు. ఉన్నవాటిని సద్వినియోగం చేసుకోవాలి.
- ఏ పని చేసినా అంకితభావంతో చేయాలి. అప్పుడే గెలుపు మన తలుపు తడుతుంది.

**సురేందర్ బండారు**

## తల్లిదండ్రుల ప్రోత్సాహంతో..

**రెండుసార్లు మెయిన్స్ క్వాలిఫై కాలేదు. మూడో అటెంప్ట్ రెండు మార్కులతో మిస్సయ్యింది. నాలుగోసారి ఇంటర్వ్యూలో మూడు మార్కులతో చేజారింది. ఐదోసారి రెండు మార్కులతో తప్పింది. అయినా పట్టువిడవకుండా ప్రయత్నించి ఆరోసారి ర్యాంకు సాధించాడు సయింపు కిరణ్. ఇంతవరకు పడిన శ్రమ ఆయన మాటల్లో తెలుసుకుందాం.**

**కుటుంబం, చదువు**

- మాది వరంగల్ జిల్లా గీసుగొండ మండలం అనంతారం. పూర్తిగా వ్యవసాయ కుటుంబం. అమ్మానాన్న జయలక్ష్మి, ప్రభాకర్ రావు. చెల్లె గిరిజ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. 1 నుంచి 3వ తరగతి వరకు మచ్చాపురంలోని ప్రైవేటు స్కూల్‌లో, 4, 5 తరగతులు కే సముద్రంలోని ప్రైవేటు స్కూల్‌లో, 6 నుంచి 10వ తరగతి వరకు మామునూర్‌లోని జవహర్‌లాల్ నవోదయ పాఠశాలలో చదివాను. గుంటూరు భాష్యం కాలేజీలో ఇంటర్మీడియట్, ఐఐటీ ఢిల్లీలో బీటెక్ సివిల్ ఇంజినీరింగ్ పూర్తి చేశాను.
- అమ్మానాన్న కష్టపడి చదివించారు. వారి ప్రోత్సాహంతోనే ఢిల్లీ వరకు వెళ్లగలిగాను.



**ఎంతో మందికి సహాయ పడాలని..**

- మా ఊరికి వచ్చే ఆఫీసర్లను చూస్తూ పెరిగాను. సివిల్స్ వైపు వెళితే ఎంతో మందికి సహాయపడవచ్చనే ఆలోచనతో ఈ రంగం ఎంచుకున్నాను. రెండుసార్లు మెయిన్స్ క్వాలిఫై కాలేదు. మూడో అటెంప్టులో రెండు మార్కులతో మిస్ అయ్యింది. నాలుగో అటెంప్టు ఇంటర్వ్యూలో మూడు మార్కులతో చేజారింది. ఐదోసారి రెండు మార్కులతో తప్పింది. ఈసారి ఆరో అటెంప్ట్‌లో ర్యాంకు వచ్చింది.

**సయింపు కిరణ్**
**568వ ర్యాంక్**

**ప్రిపరేషన్**

- 2017 నుంచి సివిల్స్ ప్రిపరేషన్ మొదలుపెట్టాను. ఫ్రెండ్స్‌తో గ్రూప్ స్టడీస్, ప్రీవియస్ క్వశ్చన్ పేపర్స్ ప్రిపేరయ్యాను. సిలబస్‌కు అనుగుణంగా చదివాను. అవసరమయ్యే పుస్తకాలు చదివితే చాలు. కెమిస్ట్రీ ఆప్షనల్‌తో పరీక్ష రాశాను. బేసిక్ బుక్స్ ఎగ్జామ్స్‌కు అనుగుణంగా చదివాను. మొదటిసారి ప్రైవేటు సంస్థలో కోచింగ్ తీసుకున్నాను. ఆప్షనల్‌కు కచ్చితంగా కోచింగ్ అవసరం. యూట్యూబ్, ఆన్‌లైన్ చానల్స్, ఇండియన్ ఎక్స్‌ప్రెస్, హిందూ పేపర్లను చదివాను.

**ఇంటర్వ్యూ**

- లెఫ్టినెంట్ జనరల్ రాజ్ శుక్లా ఇంటర్వ్యూ చేశారు. ఇంటర్వ్యూ 40 నిమిషాలు జరిగింది. నేను పోస్టల్ సర్వీసులో ఉన్నాను కాబట్టి పోస్టల్ సర్వీస్ గురించి అడిగారు. డబ్బులు పంచే విధానాన్ని అడిగారు. ఎన్నికల సమయంలో తాయిలాల గురించి ప్రశ్నించారు.

**సివిల్స్ రాసేవారికి సలహాలు, సూచనలు**

- సివిల్స్ ప్రిపేర్ అయ్యేవాళ్లు లక్ష్యం పెద్దగా పెట్టుకుని చదవాలి. అప్పుడే కోరుకున్నది నెరవేరుతుంది. మార్కెట్‌లో చాలా మెటీరియల్ లభిస్తుంది. అది మనకు ఉపయోగపడుతుంది. పరీక్షకు ఏం కావాలో అదే చదివితే చాలు. ఎగ్జామ్స్‌లో మనల్ని ఏం అడుగుతున్నారు అనాలసిస్ చేసుకుని చదివితే సరిపోతుంది. రోజూ ఆరు నుంచి ఏడు గంటలు చదివితే చాలు.

**ఉద్యోగంలో చేరాక**

- నా విధులను శ్రద్ధగా నిర్వర్తిస్తాను. సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండి పనిచేస్తాను.

**బానోత్ నర్సింహ, గీసుగొండ**

## రెండో ప్రయత్నంలో విజయం

**తల్లిదండ్రులు తమ కొడుకును కలెక్టర్‌గా చూడాలనుకున్నారు. వారి కలను సాకారం చేసేందుకు కష్టపడి చదివి సివిల్స్‌లో 554వ ర్యాంక్ సాధించాడు కొయ్యడ ప్రణయ్ కుమార్. విజయం అతడి మాటల్లో..**



**కొయ్యడ ప్రణయ్ కుమార్**
**554వ ర్యాంక్**

**కుటుంబం, చదువు**

- మాది జనగామ జిల్లా రఘునాథపల్లి. అమ్మానాన్న కొయ్యడ ప్రభాకర్, లక్ష్మిలకు మూడో కుమారుడిని. పెద్దన్న ఉదయ్‌కుమార్ ఎంబీఏ పూర్తిచేసి జేఎన్టీయూలో ప్రొఫెసర్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. రెండో అన్న డిగ్రీ పూర్తి చేసి హైదరాబాద్‌లో న్యాయ విద్య చదువుతున్నాడు. అక్క మౌనశ్రీ హైదరాబాద్‌లోని ఇంద్రప్రియదర్శిని కళాశాలలో ఎంఏ సెకండ్ ఇయర్ చదువుతున్నది. రఘునాథపల్లిలోని ప్రభుత్వ పాఠశాలలో 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు తేజస్వి ప్రైవేట్ పాఠశాలలో 6, 7 తరగతులు మేడ్చల్ జిల్లా కీసర మండలం నాగారం ప్రభుత్వ పాఠశాలలో 8, 9, 10 తరగతులు చదివాను. గజ్వేల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈసీఈలో డిప్లొమా, కూకట్‌పల్లి జేఎన్టీయూలో ఇంజినీరింగ్ పూర్తి చేశాను.

**సివిల్స్ వైపు రావడానికి**

- తల్లిదండ్రులు నన్ను కలెక్టర్‌గా చూడాలన్నది వాళ్ల కోరిక. తల్లిదండ్రుల కలను సాకారం చేయాలని సివిల్స్ ప్రిపరేషన్ మొదలుపెట్టాను. తెలంగాణ స్టడీ సర్కిల్‌లో శిక్షణ తీసుకొని మొదటి ప్రయత్నంలో 885 ర్యాంక్ సాధించి ఐఆర్ఎంఎస్‌కు ఎంపికయ్యాను. ప్రస్తుతం లక్నోలో శిక్షణలో ఉన్నాను.

**ప్రిపరేషన్**

- తెలంగాణ ఎస్సీ, ఎస్టీ స్టడీ సర్కిల్‌లో కోచింగ్ తీసుకున్నాను. యూపీఎస్సీ మెంటార్ కల్యాణ్ సలహాతో సోషియాలజీ ఆప్షనల్‌గా ఎంచుకున్నాను. రోజూ 8 నుంచి 10 గంటలు చదివాను. నా ప్రిపరేషన్‌లో **'నమస్తే తెలంగాణ నిపుణ'** చాలా ఉపయోగపడింది.

**ఇంటర్వ్యూ**

- రిటైర్డ్ లెఫ్టినెంట్ జనరల్ ఇతర అధికారులు 30 నిమిషాలు ఇంటర్వ్యూ చేశారు.

**నా సలహా**

- సివిల్స్ సాధించాలనుకునే వారు కోచింగ్ తీసుకోవాలి. కనీసం 10 నుంచి 12 గంటలు మనసు పెట్టి చదవాలి. పట్టుదల ఉంటే సివిల్స్‌లో ర్యాంక్ సాధించవచ్చు.

**సమాజమే ముఖ్యం..**

- ఉద్యోగంలో ఉన్న ప్రతి వ్యక్తికి రాజకీయ ఒత్తిడి ఉంటుంది. దాన్ని అధిగమించి బ్యూరోక్రాట్‌గా సమాజమే ముఖ్యమని నా పని నేను చేసుకుంటూ పోతాను.

**ఎన్‌ఆర్ అనిల్ కుమార్, జనగామ**